ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 02 ఫిబ్రవరి 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం

4. మాఘమాసం శుభప్రదం

5. మన దేవాలయాలు

6. రామానుజ సుధామాధురి

8. గురుభక్తి పరాయణులు

9. శ్రీపతిస్తుతి

11.శ్రీసింగరాచార్యస్వామికి పురస్కారం

12. అరైయర్ సేవ

13. జోతిర్విజ్ఞానమ్

15. మనసా వచసా

16. ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి — చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద — వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి — మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు





## ముఖచిత్ర పరిచయం

ఆధ్యాత్మిక సౌరభాన్ని అందించాలన్న సంకల్పాన్ని ఆచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయరు స్వామి వారి ముందు మోకరిల్లి నివేదించినప్పుడు చిరునవ్వుతో వారు అందించిన మంగళాశాసనాలు నాడు, నేడు శ్రీసన్నిధానం నిర్వాహకులకు వేయి ఏనుగుల బలం ఇచ్చింది. ఆబలంతోనే కొత్త పుంతలతో రంగురంగుల హరివిల్లులా ఆధ్యాత్మికతను పరిఢవిల్లేలా సంవత్సరం శ్రీసన్నిధానం పాఠకులకులను అలరిస్తూ వచ్చిన వార్షిక సంచిక దృశ్యకావ్యాన్ని ముఖచిత్రం సుస్పష్టం చేస్తోంది. ఒక మంచిపనిచేయాలంటే సంకల్పం బలంగా ఉండాలి. శ్రీసన్నిధానం నిర్వాహకుల ఈ ఆలోచనలకు అనుగుణంగా అనునిత్యం గౌరవ సంపాదకులు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. వివిధ ప్రాంతాలలో ఉన్న ప్రముఖులు, భాగవతోత్తములు వెన్నుదన్నుగా నిలిచారు. వారి అమృత ప్రవచనాల భావజాలంతో, వారి కలంనుంచి జాలువారిన వ్యాసాల సమాహారంతో శ్రీసన్నిధానంలో కొత్త వెలుగులు నింపారు. భారతజాతీయత, సంస్కృతీ సంప్రదాయాలను ఉగ్గుపాలలో రంగరించిన చందంగా రచనల అమృతగుళికలు అందించారు. ప్రపంచ వ్యాప్తంగా పాఠకులు రామానుజమార్గంలో నడిచేలా అంతర్జాలం ద్వారా కూడా ఉదయిస్తూ ఉచితంగా మీచెంతకు వస్తున్న "శ్రీసన్నిధానం"ను ఆదరించండి. సంప్రదాయాలు వెల్లివిరిసేలా ప్రోత్సహించండి!!


**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2933323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం



## వేడుక చేసుకుందాం రారండి!!

భగవద్బంధుకోటి సంఘటితంగా ఒక్కటై వేడుక చేసుకునే తరుణమిది. ఒకవైపు గణతంత్ర దినోత్సవం 2023ను పురస్కరించుకుని శ్రీమత్పరమ హంస పరివ్రాజకా చార్యులు అపర రామానుజులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామి వారికి కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్ పురస్కారం ప్రకటించటం ఎంతో ఆనందకరం మహదానందకరం. మరోవైపు సమతామూర్తిని ఆవిష్కరించుకుని సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా శ్రీ రామానుజులకు, 108 దివ్య దేశ పెరుమాళ్ళకు జరిగే బ్రహ్మోత్సవం సమతా కుంభ్-2023 ఏర్పాట్లు జరుగుతున్నాయి. మనమంతా సమతామూర్తి సన్నిధిలో 108 దివ్యదేశ పెరుమాళ్ల చెంత కలుసుకునే శుభ తరుణం మళ్లీ వచ్చింది. తిరుమంజన సేవలు విశేష ఉత్సవాలు, లక్ష మందితో భగవద్గీత పారాయణ ఇలా ఎన్నో అద్భుత కార్యక్రమాలను సేవించే భాగ్యం. చూచువారికి చూడముచ్చట!! సేవలో మేముసైతం ఉన్నామనుకున్న వారికి ఇలవైకుంఠంలో ఆనంద సాగరంలో తేలియాడే తరుణమిది. ఇప్పటికే శ్రీవారి చరణాల చెంత చేరిన పురస్కార కుసుమం వార్త విన్న వారంతా వేడుకలు జరుపుకుంటున్నారు. ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ పురస్కారం గోష్ఠులు, నగర సంకీర్తన వేడుకలు జరుపుకుంటున్నారు. మన రామానుజ నగరంలోనే (భాగ్యనగరం) కాదు, చెన్నైలో యావత్ భారతదేశంలో ఊరూ వాడాలో అభిమానులు కేరింతలు కొడుతూ పండుగ చేసుకుంటున్నారు. అంతేకాదు ప్రపంచవాప్తంగా భక్తజన కోటి వేడుక చేసుకునే తరుణమిది. ఈ క్షణాలు సుమధురమైనవి మంగళకర మైనవి, మనమంతా కలిసి నడుద్దామన్న భావన!! సంప్రదాయ, ఆర్షధర్మ పరిరక్షణలో నిరంతరం దిగ్దర్శనం చేస్తూ వుండాలన్న భావన!! ప్రస్తుత కాలపరిస్థితుల్లో మన సనాతనధర్మం, హైందవ సంప్రదాయాలు, విలువలు కొడిగట్టిన దీపాలవలే మినుకుమినుక్కుమంటున్నాయి. ఈ పరిస్థితుల్లో, ఇప్పటికే వైదికధర్మాన్ని పరిరక్షిస్తూ యోగాపై మన చినజీయరు స్వామి దృష్టిని సారించారు. ప్రాచీనకాలం నుండి సనాతన ధర్మాచరణానికి ఆయువుపట్టులు దేవాలయాలు. దేవాలయం కేంద్రంగా ధార్మిక, భక్తి, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక, సంగీతాది కార్యక్రమాలను చేపడుతూ అందరినీ కలుపుకుని ఆ సన్మార్గంలో నడపడంలో, ప్రజలలో భక్తిచైతన్యాన్ని చేకూర్చడంలో ఆచార్యులు ఎనలేని సేవ చేస్తున్నారు. శ్రీవైష్ణవం పరిరక్షణను, శ్రీరామానుజులు నడిచిన మార్గాన్ని వారు ఎంచుకుని ఆలయాల పరిరక్షణ బాధ్యతను తీసుకున్నారు. ఈ సంస్కరణలలో భాగంగా వైదిక ధర్మ పరిరక్షణకు జెట్ ద్వారా విద్యాబోధన జరుపుతూనే వైదిక గ్రంథాల సేకరణ, వాటి సంస్కరణ, పునర్ముద్రణ బాధ్యత చేపట్టారు. జీయర్‌పురస్కారం, గోపాలోపాయన పురస్కారం తన చెంత జరిపిస్తున్నారు. నిరంతరం చుట్టూఉన్న సమాజం గురించి ఆలోచిస్తూనే సమతామూర్తిని మనముందు గత సంవత్సరం ఆవిష్కరించారు. యావత్ ప్రపంచం సమతామూర్తిపై దృష్టి సారించేలా చేశారు. దశాబ్దాలుగా ధర్మచైతన్యస్ఫూర్తిని, సత్సంప్రదాయాలను ప్రచారం చేయడంలో తమవంతు కృషి బహుముఖాలుగా జీయరు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్నారు. వైదిక ధర్మంపై ఆధ్యాత్మిక గ్రంథ పరిశోధన చేయిస్తున్నారు. ఒక తరం తన తరువాతి తరానికి అందించవలసింది ధర్మం, జ్ఞానం, అనుభవసారం అనే సందేశంతో సమతామూర్తిని మనముందు ఆవిష్కరించి ఆధ్యాత్మిక చింతన అలవరచిన మహనీయులు. మన జీయరు స్వామి వారికి ఈ పురస్కారం చరణాల చెంత ఉంచిన పూజాపుష్పమే సుమా !!

– చీఫ్ ఎడిటర్

# మాఘ మాసం సౌర మాసం, శివాత్మకం శుభప్రదం

ఆధ్యాత్మిక ఆస్తిక విశ్వాసాలకు సైన్స్ అని ప్రత్యేకించి చెప్పే విజ్ఞాన శాస్త్రానికి వారధి వంటి వాడు సూర్యభగవానుడు. భగవంతుని యొక్క రక్షకత్వాన్ని తన ద్వారా మనకు అందిస్తాడు. అందుకే సూర్య భగవానుణ్ణి ప్రత్యక్ష దైవంగా కొలుస్తాము. ఒక్క భారతీయ సంస్కృతిలోనే కాక అనేక ప్రాచీన నాగరికతల్లో కూడా సూర్య ఆరాధన ప్రత్యేకమైనది. మాఘ మాసం సూర్య ఆరాధనలతో ప్రారంభమై శివ పూజలతో మహాశివరాత్రిగా ముగుస్తుంది. ఈ మాసంలో సప్త సంఖ్యకు ప్రాధాన్యం ఉంటుంది. ఏడు గుర్రాలతో గల వెండి లేక బంగారు సూర్యరథాన్ని దానం ఈయటం హోమాలు, అర్ఘ్యాలు, తర్పణాలు, పొంగలి నివేదనలు, కాల ప్రసిద్ధమైన కాయగూరలతో, పుష్పాలతో పూజలు ఆచరిస్తారు.



శీతల వాతావరణంగా అనుకూలత కలగడం వలన కొన్ని ఔషధ మూలికలు ఎక్కువగా లభిస్తాయి. అందుకే జిల్లేడు పూల పూజ వంటివి ఆచరణలో ఉన్నాయి. మకర సంక్రమణంతో ఉత్తరాయణం ప్రారంభం అయినా రథసప్తమి నుండి సూర్యరథం ఉత్తరం వైపు తిరుగుతుందని చెప్తారు. ఇళ్ళ ముందు రథం ముగ్గులు వేస్తారు. ఆగిపోయిన మరియు కొత్త నోములను ఈరోజు నోచుకుంటారు. పాడ్యమి నుండి సప్తమి వరకు ఏడు రోజులు అర్ఘ్య, హోమాలతో సూర్యుని పూజిస్తారు. ప్రత్యేకించి పర్వదినాల్లో జీవనది పుణ్యతీర్థ స్నానాలు శ్రేష్ఠమనేది భారతీయ సంస్కృతి. "ధ్యేయస్సదా సవితృ మండల మధ్యవర్తి నారాయణ సరసిజాసన సన్నివిష్టః" అని గాయత్రీ మంత్రోపాసకులు సూర్య మండలం మధ్య సరసిజాసనంపై కూర్చొని ఉన్న శ్రీమన్నారాయణున్ని ఆరాధిస్తారు.

కొన్ని ప్రసిద్ధ సూర్య దేవాలయాల్లో రథసప్తమి సూర్య జయంతి ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈరోజు అరిసవెల్లి వంటి పుణ్య ప్రదేశాల్లో సూర్య భగవానుని అర్చామూర్తి పాదాలపై సూర్యకిరణాలు పడతాయని కూడా ప్రతీతి. పుణ్యక్షేత్రాల్లో సూర్యప్రభ వాహనంపై స్వామికి తిరువీధి సేవలు ప్రత్యేక పూజలు చేస్తారు. మాఘమాసంలో వసంత పంచమి గొప్ప శుభ దినంగా భావిస్తారు. సరస్వతి జయంతిగా సరస్వతీ దేవిని పూజిస్తారు. పెద్దల మాటగా మాఘమాస పర్వదిన విశేషాలను తెలుసుకుందాం. మాఘాది పంచకం అని మౌఢ్యమి లేకుంటే మాఘమాసం మొదలు ఐదు నెలలు శుభకార్యాలకు శ్రేష్ఠమని జ్యోతిష్య పండితులు విశ్లేషిస్తారు.

మాఘ మాసం సూర్యుడు మకర రాశిలో ఉండే రోజులు పుణ్యప్రదమైనవి మాఘశుద్ధ తదియ లలితా వ్రతం. చతుర్థి శాంతా చతుర్థి గౌరీ పూజ. కుంద చతుర్థి తెల్లని పువ్వులతో శివ పూజ. తిల చతుర్థి అని తిలదానం చేస్తారు. మాఘ శుద్ధ పంచమిని శ్రీ పంచమి, మదన పంచమి, వసంత పంచమి అని అనేక పేర్లతో వ్యవహరిస్తారు. రాబోయే వసంతకాలానికి ఈరోజు నాందిగా వసంతోత్సవాలు చేస్తారు. మాఘాఖ్యా పంచ వసంతః అని ఋతు సంబంధ లేదా ప్రకృతి సంబంధ పర్వదినం.

ఈరోజు సరస్వతి దేవిని శాంతికి జ్ఞానానికి ప్రతీకగా పూజిస్తారు. మాఘ శుద్ధ సప్తమి సూర్య జయంతి రథసప్తమి అని గొప్ప పర్వదినంగా అనేక నోములు వ్రతాలు దేవాలయాల్లో ఉత్సవాలు నిర్వహిస్తారు జయంతి సప్తమి, మహాసప్తమి, సౌర సప్తమి, భాస్కరసప్తమి అని అనేక పేర్లతో వ్యవహరిస్తారు. సర్వాంగ నమస్కారాలుగా ద్వాదశనామ మంత్రాలతో సూర్య నమస్కారాలను కూడా ఈరోజు పెద్దలు నిర్దేశించారు సప్తమి నుండి భీష్మ పంచకం అని అంటారు. అష్టమి, భీష్మాష్టమి, దుర్గాష్టమి, ఏకాదశి, భీష్మ ఏకాదశి భీష్మ నిర్యాణ దినంగా ప్రార్థిస్తారు. ఏకాదశి, జయైకాదశి, ద్వాదశి, వరాహ ద్వాదశి, త్రయోదశి, విశ్వకర్మ జయంతి కార్మికులు పనిముట్లను ఉంచి పూజ చేస్తారు. మాఘపూర్ణిమనాడు చంద్రుడు 16 కళలతో ఒప్పుతుంటాడు మఘ నక్షత్రం గొప్ప కాంతివంతమైనది అరుణోదయ స్నానం, హోమం ఈనాడు విశేషమైనవి. సతీదేవి ఉద్భవించిన రోజుగా మాఘ పూర్ణిమను గురించి తెలుపుతారు. బహుళ మండలి ఏకాదశి, జయైకాదశి. ద్వాదశి, కృష్ణ ద్వాదశి వ్రతం. శనివారం వచ్చే త్రయోదశిని **(మిగతా 10 వ పేజీలో)**

# ఆరోగ్య మానసిక బాధలు తొలగించే మానేటి రంగ ధామం



## మన దేవాలయాలు

శ్రీరంగనాథస్వామి దేవస్థానం మానేటి నీటిపరవళ్ళ మధ్య చుట్టూ పచ్చని పంట పొలాల ప్రకృతి సౌందర్యంతో అలరారే శ్రీరంగనాథ స్వామి వెలసిన క్షేత్రం. సుల్తానాబాద్‌కు ఆరు కిలోమీటర్లు కరీంనగర్‌కు 25 కిలోమీటర్ల దూరంలోఉంది. ఈ క్షేత్రం చల్లూరు, గట్టెపల్లి, గర్రెపెల్లి, కాట్నపెల్లి మొదలగు గ్రామ పరిసరాల్లో ఉంటుంది. 400 సంవత్సరాల క్రిందటి ప్రాచీన దేవాలయం. చాళుక్యుల కాలంలోనే వెలసిన దేవస్థానం అని స్థల పురాణం. శ్రీరంగ క్షేత్రం నుండి శ్రీ రంగనాథ స్వామి విహారంగా వచ్చి ఋషులు మునులు తపస్సు చేసుకునే సస్య శ్యామలమైన ఈ కొండ ప్రాంతంలో ఇక్కడే కొలువై ఉంటానని సంకల్పించుకున్నాడట! ఈ మనోహర ప్రదేశంలో తాను కొలువుంటానని చుట్టూ సస్యశ్యామలంగా ఉంచుమని భక్తుల స్వప్నంలో కనిపించి ఆజ్ఞాపించాడట! ఆ విధంగా శ్రీదేవి భూదేవి నీళాదేవి సహితంగా స్వయంభువుగా రంగనాథ స్వామి ఈ క్షేత్రంలో వెలిశాడు. పాంచరాత్రాగమ రీతిలో ఈ దేవాలయంలో ఆరాధనలు జరుగుతాయి. గోవర్ధనగిరి వంశానికి చెందిన అర్చకులు శ్రీమాన్ గోవర్ధన గిరి మనోహరాచార్య. శ్రీమాన్ గోవర్ధన గిరి రాజ్ కుమారాచార్య వంశ పారంపర్యంగా ఆరాధన సేవలు నిర్వహిస్తున్నారు.

వార్షిక బ్రహ్మోత్సవ జాతరలు, ధనుర్ మాస, వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు, శ్రీరామనవమి వేడుకలు, ఇక్కడ వైభవంగా నిర్వహిస్తారు. అనేక రకాల ఆరోగ్య సమస్యలు మానసిక వ్యాధులు బాధలు శ్రీరంగనాథుని అనుగ్రహంతో తొలగిపోతాయని భక్తుల విశ్వాసం అందుకే పరిసర ప్రాంతాల ప్రజలే కాకుండా మహారాష్ట్ర, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ నుండి కూడా భక్తులు వస్తారు. పర్వదినాల్లో పలువురు రాజకీయ నాయకులు ప్రముఖులు దేవాలయాన్ని దర్శిస్తారు. అర్చకుల అనుమతితో చాలామంది భక్తులు వారి సమస్యలు తీరుటకు “తపస్సు ఉండడం” అనే పేరిట 11 రోజులు, 21 రోజులు ఇక్కడే దీక్షతో నివాసం ఉంటారు. ఎంతోమంది భక్తులు ఇలవేల్పుగా శ్రీ రంగనాథ స్వామి సన్నిధిలో విశ్వాసంతో మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి మొదలుకొని చైత్ర బహుళ చవితి వరకు వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహింపబడతాయి. ఈ సంవత్సరం కూడా ఏప్రిల్ 10 నుండి ఏప్రిల్ 20 వరకు జాతర నిర్వహింప బడుతుంది. తెలంగాణ లో జరిగే జాతరలలో రంగధామం జాతర ముఖ్యమైనది. పరిసర ప్రాంత గ్రామ ప్రజలు, భక్తులు, అర్చకులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయం నిర్మాణాత్మక అభివృద్ధితో ముందుకు సాగుతున్నది. ఇక్కడి శ్రీ రంగనాథ స్వామి మహిమలు తెలియజెప్పే అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. చుట్టూ నీళ్లతో పచ్చని పంట పొలాల సౌందర్యంతో అలరారే మానేటి శ్రీ రంగనాథ స్వామి దేవాలయ పరిసర ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.
















# శ్రీరామానుజ సుధామాధురి



## వార్షిక వ్యాస సమీక్ష

**మానవజాతి ఉజ్జీవనానికి ఉపయోగపడే అనేక అంశాలను శ్రీభగవద్ రామానుజాచార్యులు ఉపదేశించారు. అటువంటి వేల సంవత్సరాల ప్రాచీన పరంపర గల గొప్ప సంప్రదాయంలో జన్మించిన మనందరం ఆ రామానుజ మార్గ చరిత్ర విశేషాలు తెలుసుకోవాలి. వారి ఉపదేశ శ్రీ సూక్తులు ఆధునిక సమాజానికి అనువర్తనీయం కావాలి. ఆ సంకల్పంతో అక్షరాత్మకమైన ప్రయత్నంగా "శ్రీరామనుజ సుధా మాధురి" అనే శీర్షికతో శ్రీ సన్నిధానం పత్రిక సాగుతున్నది.**

నేడు వార్షికోత్సవ సంచిక ద్వారా ఆ 12 వ్యాసముల సమీక్షలను మీ ముందు ఉంచుతున్నాము.



**(జనవరి) విశేషప్రజ్ఞ:** భగవద్ రామానుజాచార్యులు జ్ఞానవంతులైన పండితులను, భక్తి గల పామరులను, భావోద్వేగంగల సామాన్యులను, శరణాగతి మార్గంగా ప్రపత్తి చేయు ప్రపన్నులను, ఇలా అన్ని రకాల జనులకు భగవద్భక్తి మార్గాన్ని తెలియపరిచారు. వారి వారి అభినివేశానికి అనుగుణంగా పరివర్తనం గావించి తరింప చేశారు. అటువంటి జగదాచార్యుల విశేష ప్రజ్ఞను ప్రస్తావించిన వ్యాసము.

**(ఫిబ్రవరి) వేనోళ్ల స్తుతించే వెయ్యేండ్ల పండుగ:** భారతీయ సమాజం మొత్తాన్ని అభిముఖం, గావించిన చారిత్రక పవిత్ర ఘట్టం. దివ్య సాకేతం ముచ్చింతల్ హైదరాబాదు నగర మందు శ్రీరామానుజ సహస్రాబ్ది సమారోహం. శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారు మరియు అనేకమంది భక్తుల సేవకుల సుదీర్ఘ కృషితో వెలసిన జగదాచార్యుల విరాణ్మూర్తి విశేషాలను వెయ్యేండ్ల పండుగగా వివరించుకున్నాము. జగదాచార్యుల తిరుమేని వైభవాన్ని వివరించిన వ్యాసము.

**(మార్చి) వసుధైకకుటుంబకం:** భగవద్ రామానుజాచార్యులు ప్రతిపాదించిన సిద్ధాంతం భగవత్ స్వరూప నిరూపణంలో ఉత్కృష్టమైనది, సమగ్రమైనది. శృతి స్మృతి పురాణ శాస్త్ర ఉభయ వేదాంత సారంగా సహేతుకంగా నిరూపించబడినది. వారు ప్రబోధించిన ఆచరణా విధానాలు సమత్వ స్ఫూర్తిని కలిగినవి. ఆధునికంగా భావించే వసుధైక కుటుంబ భావనను వారు ఆనాడే వెలువరించారు. అటువంటి సమాజ హిత భావనను, సహస్రాబ్ది ప్రతిష్ఠా విశేషాలను వివరించుకున్న వ్యాసం.

**(ఏప్రిల్) ఉత్తారకం కృపా సముద్రం:** ప్రతి మానవుడు కృతకృత్యుడు కావాలంటే భగవత్ తత్త్వాన్ని తెలుసుకోవాలి. అందుకు ఆచార్య సమాశ్రయణమే ప్రధానం. పంచ సంస్కారాలు పొంది రామానుజ మార్గాన్ని అనుసరిస్తూ ఆచార్య నిష్ఠ కలిగి ఉండాలి. ఉత్తారకత్వంతో దయాసముద్రుడైన శ్రీ రామానుజాచార్యులను కృపామాత్ర ప్రసన్నాచార్యులుగా పూర్వాచార్యులు సమన్వయం చేసిన విధాన్ని ఈ వ్యాసంలో స్మరించుకున్నాము.

**(మే) సంఖ్యా సమన్వయం-యతిరాజ వైభవం:** శ్రీరామానుజాచార్యుల తిరునక్షత్ర సందర్భంగా ప్రచురించిన వ్యాసం. సంప్రదాయ విషయాంశాల సంఖ్యలతో శ్రీరామానుజాచార్యుల జీవన వైభవానికి సిద్ధాంత విశేషాలకు సమన్వయాన్ని కూరుస్తూ జగదాచార్యుల గొప్పతనాన్ని వివరించే వ్యాసం. ఏక సంఖ్య మొదలుకొని దశ సంఖ్య వరకు అమూల్య విశేషాలతో సమర్థించి తెలిపిన వ్యాసం.

**(జూన్) సేవా భాగ్యం సౌభాగ్యం -సేవా ఫలం సాఫల్యం:** భారతీయ సంస్కృతిలో ఆచార్యుల స్థానం గొప్పతనం తెలుపుట. భగవద్రామానుజాచార్యులలోని సంపూర్ణ ఆచార్య తత్త్వాన్ని వివరించుట. దివ్య దేశాలతో శిష్య పరంపరతో శ్రీరామానుజాచార్యుల సంబంధం గురు పరంపరలో ప్రత్యేక స్థానం ఇత్యాది విషయాలను స్మరించ కునే వ్యాసం.


**(జులై) బాలసూర్యుని భావ స్ఫూర్తి:** ఎందరినో ప్రబోధనలతో తరింప చేసే జ్ఞాన ప్రకాశంలో భగవద్రామానుజాచార్యులను రామానుజ దివాకరః అని సూర్య భగవానునితో పెద్దలు పోలుస్తారు. విశిష్టమైన జ్ఞాన సంపద గల జగదాచార్యులు ఉదయించినది మొదలు గురుకులంలో తన ప్రతిభను వెలువరించిన భావ స్ఫూర్తిని ఈ వ్యాసంలో వివరించుకున్నాము.

**(మిగతా 10 వ పేజీలో)**


# శుభాశంస

**శ్రీమాన్ శ్రీ శిరిశినహల్ వెంకటాచార్యులు**

20 ఏళ్ల క్రితమే శ్రీసన్నిధానం పత్రిక పురుడు పోసుకున్నది. అనివార్య కారణాల వల్ల కొంతకాలం అంతర్ధానమై ఏడాది క్రితమే అంతర్జాల పత్రిక రూపంలో మరోసారి ఆవిర్భవించింది. శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి పరిపూర్ణ మంగళాశాసనాలతో కొత్త ఊపిరి పోసుకొని భగవద్రామానుజ సహస్రాబ్ది ఉత్సవ విశేషాలను తెలుపుతూ తొలి సంచికగా అవతరించింది. అంతర్జాలం గానే కాకుండా అచ్చు పత్రికగా కూడా అందరి చేతుల్ని అలంకరిస్తున్నది. భారతీయ ఆధ్యాత్మిక వైభవాన్ని విశేషించి సత్సంప్రదాయ సౌరభాలను ఇంటింటా



వెదజల్లుతూ ముందుకు సాగుతున్నది. ప్రత్యేకంగా భగవద్రామానుజ దర్శన విశిష్టతను ఆధునిక యువతకు అందించడంలో శ్రీ సన్నిధానం చేస్తున్న కృషి మరువలేనిది. అవసరమైనంత ఆర్థిక వనరు అందుబాటులో లేకున్నా పట్టుదలతో పత్రికను కొత్త హంగులతో ముందుకు నడిపిస్తున్న శ్రీసన్నిధానం సంపాదక వర్గాన్ని మనసారా అభినందిస్తున్నాను. సత్సాంప్రదాయ ప్రేమికులందరూ శ్రీసన్నిధానం పత్రికను దిగ్విజయంగా ముందుకు సాగించడంలో తోడ్పడాలని ప్రార్థిస్తూ వార్షికోత్సవ సందర్భంగా శ్రీసన్నిధానం పత్రికకు శుభాశీస్సులు.



## దిగ్విజయంగా కొనసాగాలి

**శ్రీమాన్ శ్రీ డింగరి లక్ష్మీనారాయణాచార్యులు**

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి పరిపూర్ణ అనుగ్రహ మంగళాశాసనములతో ప్రారంభించిన "శ్రీసన్నిధానము" ఆధ్యాత్మిక మాస పత్రిక డింగరి శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో సంవత్సరము పూర్తిచేసుకున్నది. శ్రీమద్భాగవతోత్తముల మంగళాశాసనములతో భగవత్ బంధువుల ఆదరాభిమానములతో ముందుకు సాగుతూఉంది, ఇక ముందు కూడా మీ అందరి సహాయ సహకారములతో, ఆదరాభిమానములతో ఆధ్యాత్మిక మాస పత్రిక దిగ్విజయంగా కొనసాగగలదని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

## "విజయతాం రామానుజ దివాకరః"

**శ్రీమాన్ శ్రీ కండ్లకుంట వెంకటనర్సింహాచార్యులు**

పెరుమాండ్ల కృపతో అప్పటి శ్రీసన్నిధానం ఇప్పుడు పునరుద్ధరింపబడి సంవత్సర కాలం గడిచింది. చాలా సంతోషకరమైన విషయం. ఒక పక్క రామనుజుల వారి సమతామూర్తి విగ్రహం ప్రతిష్ఠతో ఆయన తేజరిల్లుతున్నారు. వారి ఆశీర్వాదములతో నడిచే ఈ పత్రిక కూడా పాఠకులందరి యొక్క హృదయాలలో స్థానం సంపాదించుకున్నది. ఇది ఇట్లాగే వృద్ధి చెయ్యాలి. వృద్ధి కావాలి అని పెరుమాళ్ల సన్నిధిలో, రామానుజుల వారి సన్నిధిలో విజ్ఞాపన చేసుకుంటూ వున్నాడు దాసుడు. "జయ మాయి మతాంధకార భాను, జయ సంశ్రిత



సింధు శీత భాను" అని చెప్పినట్లుగా రామానుజులవారు మాయి మతాన్ని ఖండించే సూర్యుడులాగా, అజ్ఞానాన్ని నివర్తింప చేస్తూ వెలుగుతున్నాడు. అట్లాగే వేద బాహ్యులులైనటువంటి ఇతరులందరిని కూడా అది ఒక అడవిలాగ దట్టంగా పెరిగి వుంటే దాంట్లో కారు చిచ్చులాగా ప్రవేశించి నామరూపాలు లేకుండా చేసినవాడు. ఆశ్రితులైనటువంటి ప్రజాసమూహమందరికి, భాగవతోత్తముల సమూహములందరి సముద్రమువలె, సముద్రానికి చంద్రుడి వలె ఆహ్లాదాన్ని కలిగిస్తూ భాగవతోత్తములకు హర్షాన్ని కలిగిస్తున్నాడు. ఆవిధంగా రామానుజుల వలెనె మన పత్రిక కూడా అజ్ఞానాన్ని తొలగిస్తూ, నాస్తిక వాదాల్ని ఖండిస్తూ "విజయతాం రామానుజ దివాకరః" అంటూ శ్రీ సన్నిధానం కూడా మరింత మరింత దినదినాభివృద్ధి చెందాలని కాంక్షిస్తున్నాను. మీ అందరి కృషికి కూడా అభినందనలు తెలుపుతున్నాను.



## సామాజిక విశ్లేషకులు

**డింగరి వెంకటరమణాచారి**

అసలు "శ్రీసన్నిధానం" పత్రిక ప్రారంభించడమే పెద్ద సాహసం.

ఆధ్యాత్మిక రంగంలో ఎన్నో వార, పక్ష, మాస పత్రికలు వెలువడుతున్న ఈ రోజుల్లో అదే రంగంలో ఇంకో పత్రిక తీసుకొచ్చి ఎంతో వైవిధ్యం ప్రదర్శిస్తూ విజయవంతంగా నడిపించడం ప్రశంసనీయమైన విషయం. సంవత్సరం పైగా ఎలాంటి తడబాటుకు గురికాకుండా అమోఘమైన సమర్థతతో పత్రికను నడిపిస్తూ ప్రథమ వార్షికోత్సవం జరుపుకొని ముందుకు దూసుకెళ్తున్న 'శ్రీసన్నిధానం' ఎప్పటికి ఇలాగే పరిఢవిల్లుతుందనే ప్రగాఢ విశ్వాసంతో ఉన్నాను.-



# గురుభక్తి పరాయణులు కూరత్తాళ్వాన్

**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి స్థానాచార్యులు**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**

సనాతనమైన వైదిక ధర్మంలో శ్రీ వైష్ణవం కూడా ఒకటి. అనాది అయిన ఈ ధర్మం భగవద్రామానుజాచార్యుల కాలంలో విస్తృతమైన ప్రచారాన్ని పొందింది. భగవద్ రామానుజులకు కూరత్తాళ్వాన్ అని పిలువబడే శ్రీవత్సాంక మిశ్రులు మరియు మొదలియాండాన్ అని పిలవబడే దాశరథి ప్రధాన శిష్యులు. వీరిద్దరిలోనూ శ్రీవత్సాంక మిశ్రులకు సంప్రదాయంలో గొప్ప స్థానం ఉంది. దానికి కారణం భగవద్రామానుజుల సంరక్షణకై వీరు తమ ప్రాణాలను సైతం లెక్క చేయక వైష్ణవ దర్శనస్థాపనకై తమ దర్శనాన్ని (నేత్రాలను) కూడా పోగొట్టుకున్న గురుభక్తి పరాయణులు కావడం., దర్శనమునకు (మత సాంప్రదాయానికి) ప్రధాన గ్రంథమైన బ్రహ్మసూత్ర భాష్య రచనలో ప్రధాన భూమికను పోషించడం., శ్రీరామానుజులు ఉత్తరాధికారి అయిన శ్రీపరాశరభట్టర్ అను మహనీయులకు జన్మనిచ్చిన తండ్రి కావడం. అట్టి మహనీయులైన వీరి తిరునక్షత్రం మకర మాసం హస్త నక్షత్రం అనగా తేదీ 10/02/2023 నాడు .



శ్రీవత్సమిశ్రులు కాంచీపురానికి సమీపంలో ఉన్న 'కూరం' అనే గ్రామానికి అధిపతులు. గొప్ప ఐశ్వర్యవంతులు వీరు. వీరికున్న అపరిమితమైన సంపదను తృణప్రాయంగా వదిలి భార్యాసహితులై శ్రీరంగ క్షేత్రానికి చేరుకొని భగవద్రామానుజాచార్యుల శిష్యుడై సంప్రదాయ పరిరక్షణలో గొప్ప భాగస్వామ్యాన్ని వహించారు. "కూరం" గ్రామాధిపతులు కావున వీరికి కూరత్తాళ్వాన్ అనే పేరు ప్రసిద్ధమైనది.

క్రిమికంఠ చోళు డనే శైవ సాంప్రదాయానికి చెందిన రాజు భగవద్ రామానుజులను హింసించడానికి ప్రయత్నించగా వారి వేషంలో ఆ రాజు వద్దకు కూరత్తాళ్వాన్ వెళ్లి సభలో వాదించి విష్ణు పరత్వ స్థాపనం చేశారు. వీరిపై కోపగించిన రాజు వీరి కనులను పెరికి వేయించబోగా "నిన్ను చూసిన ఈ కళ్ళతో నేను నా దైవమైన రంగనాథుని గాని, మా ఆచార్యులైన శ్రీ రామానుజులను కానీ చూడలేను". అంటూ తామే స్వయంగా తమ కన్నులను పెరికి వేసుకున్న గొప్ప సాహసి వీరు. అలా శ్రీవైష్ణవ విశిష్టాద్వైత దర్శన స్థాపనకై తమ దర్శనాన్ని (నేత్రాలను) త్యాగం చేసిన మహనీయులు వీరు.

భగవద్ రామానుజాచార్యుల వారు వేద వ్యాస భగవానుడు వ్రాసిన బ్రహ్మసూత్రములకు భాష్యమును రాయడానికి సంకల్పించి, ఆ సూత్రములకు భగవద్ బోధాయన మహర్షి వ్రాసిన వృత్తి గ్రంథము కాశ్మీరంలోని శారదాపీఠంలో ఉన్నదని తెలిసి ఆ గ్రంథం ఆధారంగా భాష్యమును రచించారు. వీరు బోధాయన వృత్తి గ్రంథ పరిశీలనకై కాశ్మీరానికి వెళ్లినప్పుడు కూరత్తాళ్వాన్ కూడా వీరితో వెళ్లారు. అక్కడివారు గ్రంథాన్ని రామానుజుల వారికి ఇచ్చి పంపడానికి నిరాకరించడంతో ఏకసంథాగ్రాహి అయిన కూరత్తాళ్వాన్ ఆ గ్రంథాన్ని పూర్తిగా కంఠస్థం చేశారు. స్వతంత్రంగా రామానుజులు బ్రహ్మ సూత్రములకు భాష్యాన్ని రచిస్తూ కూరత్తాళ్వాన్‌కు చెప్పే వారట! బోధాయన వృత్తికి అనుకూలంగా ఉన్నదని కూరత్తాళ్వాన్ పలికితేనే భాష్యాన్ని వ్రాసే వారట రామానుజులు!

ఆ విధంగా తమ ఆచార్యులకు సూత్ర భాష్య రచనలో సహకారాన్ని అందించి దర్శన (మత సంప్రదాయ) ప్రవర్తనకు సహకారాన్ని అందించిన మహనీయులు కూరత్తాళ్వాన్.

వీరికి గల గురుభక్తి అనన్య సామాన్యమైనది. క్రిమికంఠ చోళుని కాలంలో భగవద్రామానుజుల వారు శ్రీరంగాన్ని విడిచి కర్ణాటక రాష్ట్రంలోని మేల్కోట ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చింది. తమ ఆచార్యుల వారు లేని శ్రీరంగంలో తాము కూడా ఉండనని వారు వచ్చేంతవరకు క్షేత్ర ప్రవేశం చేయకుండా తిరుమాలిరుమ్‌శోలై అనే క్షేత్రంలో నివసించి తిరిగి రామానుజుల వారు వచ్చిన తర్వాతనే శ్రీరంగం చేరుకున్న గురుభక్తి పరాయణులు వీరు. శ్రీ రంగనాథుని మరియు తమ ఆచార్యులను ఎడబాసి ఉండలేక భగవదనుగ్రహంతో ˆమకు మరల భగవంతుని ఆచార్యులను కలిసే అవకాశాన్ని ఎదురుచూస్తూ తిరుమాలిరుమ్‌శోలై వెళ్లే మార్గంలో శ్రీవైకుంఠ స్తవం, అతిమానుషస్తవం అనే స్తోత్రములను రచించారు.

**(మిగతా 10 వ పేజీలో)**


# శ్రీపతి స్తుతి

## సుభాషితం
### మంచి మాట

**శ్రియై నమః! శ్రీధరాయ నమః!**

**హర్యష్టకం**

**(గత సంచిక తరువాయి)**



శ్రీమాన్ అమరవాది వేంకటనరసింహా చార్యులు

సః పుష్కరం చ = అతడే పుష్కర క్షేత్రావలె పుణ్యప్రదుడౌతాడు. శ్రీమన్నారాయణుడు జల రూపంలో పుష్కరంలో వుంటాడు. ఆయనకు ఇష్టం జల రూపం! 'ఆపో వా ఇదగ్ం సర్వం, విశ్వాభూతాన్యాపః' అని వేదం. అంతా జలరూపమే 'ఆప ఏవ ససర్జ ఆదౌ' అని మొదట నీళ్ళే సృష్టించాడన్నది వేదం. 'యోపాం పుష్పం వేదా' అనేది ఒక పెద్ద ఆశీర్వచన మంత్రం. ఆపో నారాయణః' అని గూడా వున్నది. ఇన్ని రకాల ఫలితాలు కేవలం 'హరి' అని రెండక్షరాలు అన్నవారికి లభించును. అని ప్రహ్లాదుడు హర్యష్టకం రెండవ శ్లోకంలోచెప్పినాడు.

3 వ శ్లోకం॥

**వారాణస్యాం కురుక్షేత్రే నైమిశారణ్య ఏవ చ।**
**యత్కృతం తేన యేనోక్తం హరి రిత్యక్షర ద్వయమ్॥**

యేన = ఎవనిచేత, హరిః ఇతి = హరి అని, అక్షరద్వయమ్= అక్షరములజంట, ఉక్తం = పలుక బడినచో, తేన = అతని చేత, వారణస్యాం = కాశియందు, కురుక్షేత్రే = కురుక్షేత్ర మందు, నైమిశారణ్య ఏవ చ = నైమిశారణ్యమందే, యత్ కృతం = ఏదైతే చేయ బడిందో, (ఆపుణ్య కార్యాలు చేయడం వలన గలిగిన మంచి ఫలితము పొందబడుతుంది.)

తాత్పర్యము - క్రిందటి శ్లోకంలో వలెనే ఈ శ్లోకంలో కూడా చెప్పబడింది. పవిత్ర ప్రదేశము లందు భగవంతుని దయను పొందుటకై అనేక విధాల పనులు చేస్తాము అంటే తపస్సు, దాన ధర్మాలు, యజ్ఞ యాగాలు, కథాశ్రవణం, పురాణశ్రవణం మొదలైన మంచి పనులు ఈ పుణ్య క్షేత్రాలలో చేస్తే ఇతర ప్రదేశములలో చేసిన దాని కన్న రెట్టింపు ఫలితం వుంటుంది. అయితే హరి అనే రెండక్షరములు ఎవరైతే పలుకుతారో అతనికి ఈ ఫలితాలన్ని లభించుతాయి. ఏమిటి? ఈ క్షేత్రాలలో వుండే గొప్ప? అంటే చాలా పెద్ద ఫలితమండీ! కొన్ని కొన్ని క్షేత్రాలకు, తీర్థాలకు స్థల ప్రభావం వుంటుంది. అది మనకు గూడా అనుభవం! ఏమంటే దేవాలయానికి వెళ్ళామనుకోండి!. ఏదో ప్రశాంతత! పుణ్య కార్యాలు చేయాలి అనే ఆలోచన. పరోపకార బుద్ధి కలుగుతుంటుంది.

గుడిలోకి వెళ్ళేముందు పండ్లు, పూలు, కొబ్బరి కాయ కొంటుంటాంగదా! అప్పుడు మనం ఏ చేస్తాం?. మల్లె పూల దండనే వుందనుకుందాం, లేదా అరటి పండ్లు. వాడేదో ధర చెప్పుతాడు. మనం బేరమాడుతాము. "పది రూపాయలకు మూర, లేదా డజను 50 రూపాయలు టెంకాయ అంటే 8 రూపాయిలకు ఇవ్వవా? 40 రూపాయలకు ఇయ్యొచ్చుగదా 25 రూపాయలకు టెంకాయ ఆదుకాణంలో ఇస్తున్నాడు గదా!" అంటాము. తీరా ఆ గుడిలోకి వెళ్ళి నైవేద్యం పెట్టమని పూజారికి ఇస్తాం. ఆయన మనం తెచ్చిన దానిలో కొంత తీసుకొని ఇస్తాడు. అప్పుడు మనం ఏమన్నా అంటామా? అనము. మిగిలిన భాగాన్నే నమస్కారం పెట్టి తీసుకొని ఆ ప్రసాదాన్ని అడగకున్నా ఇతరులకు పంచి పెడతాము. ఏమిటీ తేడా? అవతల బేరమాడి, రేటు తగ్గించి తెచ్చుకున్న వాటిని ఇతరులు అడగకున్నా పటు తీసుకో! అంటూ ఇస్తున్నాం గదా? కారణం? అది ఆ స్థల ప్రభావం. దేవుని ప్రభావం అన్నట్లే గదా కాబట్టి తీర్థ- క్షేత్రాలకు ప్రభావం వుంటుంది. కాశీలో దాన ధర్మాల వల్ల విశేష ఫలం లభిస్తుంది అనే దాన్ని క్రిందటి శ్లోకంలో విన్నాం. ఈశ్లోకంలో కూడా కాశీలో మంచి దానాలు చేస్తే ఏఫలితమో అది లభించును అని చెప్పబడింది.

ఇక కురుక్షేత్రే అంటే కురుక్షేత్రం ఉత్తరభారతం లో వుంది. గొప్ప క్షేత్రం. దానికి 'ధర్మ క్షేత్రం అని ప్రసిద్ధ పేరు. ఇక్కడ భగవద్గీత చెప్పబడింది. శ్రీకృష్ణుడు అర్జునునకు గీతాబోధ చేశాడు అక్కడే. క్షేత్ర ప్రభావం వలన అక్కడ జపం, హోమం, యజ్ఞం ఏది చేసినా శ్రీకృష్ణుడు సంచరించిన క్షేత్రం, భీష్మాది మహా యోధులు సద్గతి పొందిన ప్రాంతం కాబట్టి విశేషమైన పుణ్యం లభిస్తుంది. భగవత్ గీత ప్రారంభమే 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే' అని వుంటుంది.

**మరికొన్ని మంచి విషయాలు వచ్చే సంచికల్లో...**

## వార్షిక వ్యాస సమీక్ష

**(6వ పేజీ తరువాయి)** **(ఆగస్ట్) సహస్ర సంజీవిని:** ఎందరో జనులకు శిష్యులకు పావనత్వాన్ని ప్రసాదించిన పరమదయాళువు జగదాచార్యులు వారి మహత్తు సమకాలీనులనే కాదు సృష్టి ఉన్నంతవరకు ప్రపత్తి చేసిన ప్రతి ఒక్కరిని ఉద్ధరిస్తుందనేది సత్యం! ఆచార అనుష్ఠాన భావనా లోపాలు అనే రుగ్మతలను సరిచేసిన సంజీవిని వంటి జగదాచార్యుల జీవిత విశేషాలను తెలిపే వ్యాసం.

**(సెప్టెంబర్) దర్శనం నిదర్శనం:** 120 సంవత్సరాలు సమకాలీనులకు దర్శన భాగ్యాన్ని ప్రసాదించి వేల సంవత్సరాలు అనుసరించదగు శ్రీరామానుజదర్శనాన్ని ప్రసాదించారు. ఉపదేశ వాఙ్మయాన్ని అందించారు. జగదాచార్యుల దివ్యమంగళ స్వరూపం మరియు సిద్ధాంత దర్శనం గొప్పతనం గురించి వివరించే వ్యాసం.

**(అక్టోబర్) సంబంధం బంధమోచనం:** మణి మంటప మార్గదాయిగా స్తుతించబడు భగవద్రామానుజాచార్య సంబంధం భగవత్ సంబంధాన్ని మనకు తెలియజేస్తుంది. సంసార బంధమోచనాన్ని కలిగించి దుఃఖాన్ని తొలగిస్తుంది. ఆచార్య సంబంధాన్ని జగదాచార్యుల కథా వైభవంతో ఈ వ్యాసం తెలియజేస్తుంది.

**(నవంబర్) పావనపాదం-ప్రయాణవిజయం:** భగవద్రామానుజాచార్యుల జీవనప్రయాణంలో వారు ఎదుర్కొన్న ఒడిదుడుకులు భగవద్ తత్త్వ దర్శనం, అందరినీ ఉద్ధరించిన విధాన్ని స్మరించుకోవడం ఈ వ్యాసాంశం. శ్రీపెరంబుదూరులో ఉద్భవించినది మొదలుకొని శ్రీ కంచి శ్రీరంగం మేలుకోట అనేక దివ్య దేశ ప్రయాణాలు ఈ వ్యాసంలో ప్రస్తావించ బడ్డాయి.

(డిసెంబర్) వాత్సల్యం వరదాయకం: అమృతోపమానమైన జగదాచార్య వాత్సల్యం ఏ విధంగా వరదాయకం అయిందో స్మరించుకోవడం వ్యాసాంశం. యతి రాజులు వరవరమునులుగా మళ్లీ అవతరించి వరదాయకులు అయిన విశేషాలను వివరించే వ్యాసం.

**(జనవరి) భక్తి భావ ప్రీతి దివ్య ప్రబంధ ఖ్యాతి:** ఆళ్వారుల భక్తి, శరణాగతి, ప్రపత్తి తత్త్వాలను ప్రకాశింప చేసేది రామానుజ సంప్రదాయం. ఉభయ వేదాంత సారంగా ఉద్భవించినది రామానుజ మార్గం. జగదాచార్యులకు దివ్య ప్రబంధాలపై గల ప్రీతిని వారు విస్తరింప చేసిన ఖ్యాతిని వివరించే వ్యాసం.

శ్రీభగవద్రామానుజాచార్యుల జీవిత కథాంశాలతో రామానుజ మార్గ గొప్పతనాన్ని వివరిస్తూ శ్రీసన్నిధానం పత్రిక అనేక విశేషాలను పాఠకులకు అందిస్తున్నది.అభివర్ధతాం

## మాఘ మాసం సౌర మాసం, శివాత్మకం శుభప్రదం

**(4 వ పేజీ తరువాయి)** శని త్రయోదశిగా శనైశ్చర జప దానాలు చేస్తారు. చతుర్దశి మహాశివరాత్రి దేశమంతా అత్యంత భక్తి శ్రద్ధలతో లింగోద్భవం, జాగరణ ఉపవాస పూజలు, రథోత్సవాలు, నిశిపూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. పంచభూతాల్లో నీరు సర్వశక్తిమయమైనది. ప్రవాహ శీలకమైన జలానికి దోష హరణ గుణం ఉంటుంది. మాఘ మాసంలో సూర్యుడు శుభప్రదుడు ఆ సూర్య కిరణ శక్తిని నీరు తాను ధరిస్తుంది కనుక మాఘ స్నానం సద్యోముక్తి ప్రదము అని పెద్దలు చెప్తారు. మాఘమాసం మందలి పుణ్య దినాల్లో ప్రశస్తమైన మూడు వ్రతాలను పెద్దలు తెలియజేస్తున్నారు. 1) బాల నిత్య వ్రతం (ఆరోగ్యానికి) నిత్యం స్నానం చేసి సూర్య భగవానునికి ఆరుసార్లు అర్ఘ్యం ఇచ్చి ఆరు సార్లు మొకరిల్లాలి. 2) ధన పాల వ్రతం (దారిద్ర్యం పోవుటకు) శుక్లపక్షమందలి చివరి ఆదివారం సూర్యుణ్ణి పూజించాలి. 3) నిత్య దాన వ్రతం (ఆరోగ్యం) మాఘ మాసం ప్రతిరోజు సూర్య పూజ చేసి పిడికెడు బియ్యం ఒక పాత్రలో రోజు వేసి ఉంచాలి. నెలరోజుల తర్వాత పేదలకు పంచాలి. "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అని ఆరోగ్య ప్రదాత అయిన సూర్య భగవానుని ప్రాధాన్యంతో మాఘమాసం సాగుతుంది.

## గురుభక్తి పరాయణులు కూరత్తాళ్వాన్

**(8వ పేజీ తరువాయి)** తిరుమాలిరుమ్‌శోలై చేరుకున్న తర్వాత అక్కడ వేంచేసియున్న సుందరబాహుస్వామిని కీర్తిస్తూ సుందర బాహుస్తవాన్ని తర్వాత శ్రీస్తవాన్ని రచించారు. శ్రీరామానుజుల వారి ప్రోత్సాహంతో కాంచీపురం వరదరాజస్వామిపై వరదరాజస్తవాన్ని రచించారు. వీరు కేవలం ఈ స్తోత్రగ్రంథాలనే కాక యమకరత్నాకరం అనే గ్రంథాన్ని మరికొన్ని శాస్త్ర గ్రంథాలను కూడా రచించారు. వీరు ఎంత పండితులో అంత భక్తి వైరాగ్యాలను కూడా కల మహనీయులు. వీరి తిరునక్షత్ర సందర్భంగా వీరిని స్మరించుకుందాం!

శ్రీవత్స చిహ్న మిశ్రేభ్యో నమ ఉక్తి మధీమహే
యదుక్తయః త్రయీ కంఠే యాంతి మంగళ సూత్రతాం

# శ్రీమాన్ శ్రీ డా ఈ. ఏ. సింగరాచార్య స్వామికి "గోపాలోపాయనం"




పండితరత్న, వేదాంత వాచస్పతి, సత్ సాంప్రదాయ విద్వన్మణి, సాంప్రదాయ సుధాంబుధి ఇత్యాది బిరుదులను పొందారు. శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారి కరకమలములతో గోపాల దేశిక పురస్కారం కూడా పొందారు.


2004 తిరుమల చారిటబుల్ ట్రస్ట్, 2008 శ్రీ వైష్ణవ సంఘం హైదరాబాద్, 2009 హనుమకొండ, కోవెల రంగాచారి మెమోరియల్ ట్రస్ట్, 2009 ఉభయ వేదాంత సభలు, 2009 త్రిదండి శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ స్వామి గీతాశ్రమం కరీంనగర్, 2012 శ్రీ వైష్ణవ సంఘం వరంగల్, 2016 శ్రీ భాష్యం అప్పలాచార్య జ్ఞాపకార్థం, 2017 తిరువెంగళమ్మ జ్ఞాపకార్థం,

2018 గుడిమెట్ల రామచంద్రాచార్య స్వామి కవి గారు, 2017 శ్రీ రఘునాథాచార్య స్వామి జన్మదిన పురస్కారం, కందాళై కృష్ణమాచార్య జ్ఞాపకార్థం మొదలగు అనేక సన్మానాలను గౌరవాలను స్వీకరించారు. శ్రీమాన్ శ్రీ ఈ.సింగరాచార్య స్వామి గారి తల్లిగారు సీతమ్మ. తండ్రిగారు న్యాయ వేదాంత విద్వాన్ శ్రీమాన్ శ్రీ ఈ. రంగాచార్య స్వామి. తాతగారు మహా విద్వాన్ శ్రీమాన్ శ్రీ ఈ. శేష సింగరాచార్య స్వామి. వారి విద్యాభ్యాసం వృత్తి: ఎం ఎ పి హెచ్ డి సంస్కృతం. ఎం ఏ తెలుగు సాహిత్య ఆచార్య. జూనియర్ కళాశాల అధ్యాపకులు, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు తిరుపతి స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. సదా సంప్రదాయ సేవలో కొనసాగుతున్నారు.

వేదాంత వాచస్పతి పండితరత్న శ్రీ ఉ.వే. శ్రీమాన్ శ్రీ డా. ఈ. ఏ సింగరాచార్య స్వామి వారు అనేక సాంప్రదాయ ప్రవచనాలను చేయటమే కాకుండా ప్రసిద్ధ గ్రంథ రచన కొనసాగిస్తున్నారు. శరణ్య, సప్తగిరి, భక్తి నివేదన, భక్తామృతం, గోవిందప్రియ, ఆత్మజ్యోతి, త్రికరణ్మయి, శ్రీసన్నిధానం మొదలైన పత్రికలకు పలు ధారావాహికలు, సాంప్రదాయక విశేషాలపై శతాధికంగా వ్యాసాలను అందిస్తున్నారు. ఆళ్వారాచార్యుల గ్రంథ వ్యాఖ్యానాలు అనువాద రచనలే కాకుండా ప్రయోజనవంతమైన ప్రశస్తమైన ఒక గొప్ప సాంప్రదాయ అంశాన్ని వెలికి తీసి మూలంలోని భావం ఆధారంగా పరిశోధనాత్మకంగా వ్యాసాలను రచిస్తారు. ఉభయ వేదాంత విజ్ఞాన సర్వస్వాన్ని శ్రీ భగవద్ రామానుజ మార్గ భావజాలాన్ని అనేక గ్రంథాలుగా, సాంప్రదాయ వ్యాసమాలికలుగా అనువాద రచనలుగా విస్తృతంగా రచించి అందించిన శ్రీమాన్ శ్రీ సింగరాచార్య స్వామివారు శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారి కరకమలముల మీదుగా 26వ "గోపాలోపాయన" పురస్కారాన్ని స్వీకరించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని "సూర్యుణ్ణి దివిటీతో చూపిస్తున్నట్టు" వారి పరిచయ విశేషాలను అందిస్తున్నాము. వారు శ్రీసన్నిధానం పత్రికకు విశేష వ్యాస సూక్తులను అందిస్తున్నారు. "ప్రవచనండాట్ కం" లో తిరుప్పావై ప్రవచనాలు చేశారు. అనేక సంస్థల ద్వారా



# అపూర్వమైన సమాహార కళ అరైయర్ సేవ.





శ్రీమాన్ శ్రీ ఈ. ఏ సింగరాచార్య స్వామి

అరైయర్ సేవ అనేది ద్రావిడ దేశానికి సంబంధించిన ఒక అపూర్వమైన, సాంప్రదాయకమైన అభినయకళ.. శ్రీవైష్ణవ దేవాలయాలలో, విశేషించి, తమిళనాడులో ఉండే వైష్ణవ దేవాలయాలలో, ఉత్సవాలు జరిగే సందర్భాలలో, ఉత్సవమూర్తి ఎదురుగా ఈ కళ ప్రదర్శింపబడుతుంది. దివ్య సూరులు అనబడే ఆళ్వారులు అనుగ్రహించిన పాశురాలను విలక్షణమైన దేవగాన ప్రక్రియలో లయబద్ధంగా గానం చేస్తూ, దానికి అనుగుణంగా తాళం వేస్తూ, ఆ పాశురాలలో తెలుపబడే అర్థానికి అనుగుణంగా అభినయాన్ని చేస్తూ, పాశురంలో ఉండే అర్థాన్ని వివరిస్తూ ఈ కళ ప్రదర్శింపబడుతుంది. పూర్వకాలంలో ఇది చాలా ఆలయాలలో ప్రదర్శింపబడినప్పటికీ, ప్రస్తుతం శ్రీరంగం, అళ్వార్ తిరునగరి, శ్రీవిల్లి పుత్తూరు, మేల్కోటైవంటి పరిమితమైన ఆలయాలలో మాత్రమే కనబడుతున్నది.

ఈ గానాన్ని నాథమునులు అనే శ్రీ వైష్ణవ సంప్రదాయానికి చెందిన పూర్వాచార్యుల కాలంలో. ఆరంభమైనదని చెప్పబడుతున్నది. ఆ మహనీయులే ఈ కళ రూపకల్పనకు మూలపురుషులు. వీరే ఆళ్వారుల పాశురాలకు దేవగానరీతిలో రాగతాళాలను సమకూర్చి, ఆ యా పాశురాలకు అనుగుణంగా అభినయాన్ని ఏర్పరచారు. తాము రూపొందించిన ఈ అభినయ కళను కీళై అగత్తాన్, మేలై అగత్తాన్ అని ఇద్దరు తమ మేనల్లుళ్ళకు నేర్పి, వారిచే శ్రీరంగంలో శ్రీరంగనాథుని ఉత్సవమూర్తి ముందు ఈ కళను ప్రదర్శింపజేశారు. ఈ ఇద్దరి వంశాలకు చెందినవారే ఈనాడు అరైయర్ కుటుంబాలకు చెందినవారుగా నమ్మబడుతున్నారు. ప్రతి సంవత్సరం ధనుర్మాస సందర్భంగా శ్రీరంగంలో అధ్యయన ఉత్సవాల సమయంలో వైకుంఠ ఏకాదశికి ముందు పది దినాలు, వైకుంఠ ఏకాదశి నుండి పది దినాలు, మొత్తం 20 దినాల పాటు జరిగే ఆరైయర్ సేవ తప్పక చూడవలసిన ఒక అపూర్వమైన దృశ్యం.


అరైయర్ సేవను చేసేవారు "పంచకచ్ఛం" ధోవతిని ధరిస్తారు. శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందిన నామాన్ని ముఖంలో ధరిస్తారు. తలపై కుళ్లాయి అనబడే టోపీని ధరిస్తారు. దీనిపై శ్రీవైష్ణవ చిహ్నాలు అయిన నామం, శంఖం, చక్రం అలంకరింపబడి ఉంటాయి. ఈ సేవను వీరు ఆరంభించటానికి ముందు వీరికి బహుమానంగా భగవంతుని పరివట్టం, నిర్మాల్యం, శఠారి బహుకరింపబడతాయి.

అరైయర్ సేవలో ప్రధానంగా మూడు భాగాలు ఉంటాయి. మొదట పాశురం తాళసహితంగా గానం చేయబడుతుంది. తరువాత. ఆ పాశురంలోని అర్థానికి అనుగుణంగా అభినయం చేయబడుతుంది. ఆ తరువాత, పాశురంలోని అర్థాన్ని వివరిస్తూ మణిప్రవాళశైలిలో రచింపబడిన వివరణ అనుసంధింప బడుతుంది. ఈ వివరణకే "తంబిరాన్ పడి" అని పేరు.

అత్యంతప్రాచీనమైన, భారతీయసంప్రదాయానికి చెందిన అపూర్వమైన సమాహార కళ ఈ అరైయర్ సేవ. ★



# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

శ్రీసన్నిధానం గౌరవ సంపాదకులు శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక స్వామి జ్యోతిర్విజ్ఞానంలో మంచి పండితులు. అడిగిన వెంటనే వాస్తవాన్ని మనముందు ఆవిష్కరించగలిగిన వారు. వారి ద్వారా నిత్య జీవితంలో మనకు కలిగే జ్యోతిష్యశాస్త్ర విషయ సందేహాలకు పరిష్కారం లభించేలాగా, జ్యోతిష్యం నేర్చుకోవాలన్న వారికి ఉపయోగపడేలాగా ఈ శీర్షిక కొనసాగించాలని శ్రీసన్నిధానం భావన. శ్రీసన్నిధానం పాఠకుల సందేహాలకు సమాధానాలు ఇస్తామని ప్రకటించారు. మీ సందేహాలకు పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

---

*యః కర్త జగతాం భర్తా సంహర్త మాసాం నిధిః ।*
*ప్రణమామి తం ఆదిత్యం బహి రంత స్తమోపహం ॥*

*కాలేన పరితా వేదా మాసమేకం పురాణకం ।*
*సద్య స్ఫలతి గాంధర్వం జ్యోతి ర్వైద్యం నిరంతరం ॥*

దివ్యమైనటువంటి అనేక శాస్త్రాలకు, పురాణాలకు, విజ్ఞాన విషయాలకు పుట్టినిల్లు భారతదేశం. ఈ దేశంలో అనేకానేక శాస్త్రాలు ఋషుల ద్వారా వాళ్ళ దర్శన సమాన ఆకారం ద్వారా భగవత్ సంబంధ మైనటువంటివి, ప్రకృతి సంబంధ మైనటువంటివి, జీవన విధాన సంబందమైనటువంటివి ఎన్నో గ్రంథాలు వచ్చాయి. వానిలో వేదాంగముగా ప్రసిద్ధి పొందినటువంటది జ్యోతిష్య శాస్త్రం. జ్యోతి అంటే వెలుతురు. శాస్త్రం అంటే మార్గం. చేతికి దీపాన్నిచ్చి మార్గాన్ని చూపిస్తే చీకట్లోనైనా కూడా మానవుడు సుఖముగా ప్రయాణం చేసి గమ్యాన్ని చేరుకొంటాడు. అట్లాగే మాములుగా నడిచే మార్గంలో ఒక దీపం ఎంత అవసరాన్ని తీరుస్తుందో నడవడానికి మార్గాన్ని గమ్యాన్ని చేరడానికి, అట్లాగే జీవన మార్గంలో సహజంగా రేపేమి జరుగుతుంది? రేపేమి చేయాలి? నిన్న జరిగింది చెప్ప గలుగుతాం! ఈ రోజు జరిగినంత వరకు చెప్పుకో గలుగుతాం! కానీ “రేపు జరిగేటటువంటి యొక్క స్థితి గతులు ఎలావుంటవి అనే విషయాన్ని చెప్పగలిగినటువంటి శాస్త్రం జ్యోతిష్య శాస్త్రం” అని ప్రాచీనుల యొక్క విశ్వాసం. వాళ్ళు ఆమోదించి, అంగీకరించి ఆ శాస్త్రాన్ని లోకానికి వ్యాప్తం చేసారు.



ఈ జ్యోతిష్య శాస్త్రంలో ఒక భాగం జాతక భాగం, రెండవది ముహూర్త భాగం, మూడవది ప్రశ్న భాగం, నాలుగు ఖగోళం, ఐదు భూగోళం, ఆరు వాస్తు భాగం అంటారు.

జాతక భాగం లో జన్మించిన నక్షత్రాలు సుమారుగా 27 నక్షత్రాలు గణన చేస్తారు. తద్వారా 12 రాశులను నిర్ణయిస్తారు. తరువాత రాశులకు గ్రహాల ఆధిపత్యాన్ని ఇస్తారు. ఇచ్చినప్పుడు 27 నక్షత్రాలు, 9 గ్రహాలు, 12 రాశులు ఉంటే మరి లోకంలో వుండే జనమంతా 12 రకాలు, 9 రకాలు, 27 రకాలు పుడుతున్నారా? ఎందుకు దీనికి జాతకం యొక్క ప్రాధాన్యత? ప్రాశస్త్యత ఎందుకు వచ్చింది అంటే, నక్షత్రాలు 27, రాశులు 12, గ్రహాలు 9 దే కానీ ముఖవైభవాలు చూస్తే లోకంలో కొన్ని కోట్ల రకాలు. గుణవైభవాలు చూసినా కొన్ని కోట్ల రకాలు. ఆకారాలు గాని, మాటతీరు గాని, వాళ్ళ వాళ్ళ ఐశ్వర్యం గాని, తెలివితేటలుగాని, విద్యాదులు గాని, వైభవాలు గాని ఒకరికి ఉన్నట్టు ఒకరికి వుండవు అని మనం కళ్ళతో చూస్తున్నాం. కోట్ల రకాల ముఖాలు, అలవాట్లు, గుణాలు ఏమిటి? ఈ తారతమ్యం ఎందుకు వచ్చింది?

(మిగతా 14 వ పేజీలో)

# జ్యోతిర్విజ్ఞానమ్



**(13 వ పేజీ తరువాయి)** ఈ 9 గ్రహాలు, 12 గ్రహాలు, 27 నక్షత్రాలు ఉంటే అనగా. ఒక్కొక్క గ్రహము కుండలిలో కదిలే స్థితి గతులను అనుసరించి, వాళ్ళ వాళ్ళ వైభవాలు గాని, జీవిత విధానాలు గాని చాలా తేడాగా వేరువేరుగా వుంటాయని మనకు జ్యోతిష శాస్త్రం చెపుతుంది. ఆ జ్యోతిష్య శాస్త్రం ఏ భాగంలో చెబుతుంది అంటే జాతక భాగంలో చెపుతుంది.. రెండవది ముహూర్త భాగం. 24 గంటలు, ముప్పై రోజులకు నెల, 365 రోజులకు సంవత్సరము అయితే అందులో ఉండేటువంటి సుమూహూర్తము, మంచి రోజు, చెడురోజు ఎందుకట అంటే, ముహూర్తము అనేదానికి అర్ధము ఏమిటి అంటే! ఏ ఏ గ్రహాలు, ఏ ఏ రాశులలో వుండి, ఏ కార్యాన్ని నిర్వహించాలి అనుకొంటే, ఆ కార్యాలను సులభంగా, ఆ తరువాత అద్భుతమైనటువంటి ఫలవంతంగా ఆ కార్య ఫలాలు మనకు రావాలి అంటే దానికి ఒక సుమూహుర్త కాలం వుంటుంది. సూర్యుడు ఒక్కడే కానీ కాలాన్ని అనుసరించి సూర్యుని యొక్క గమనంలో తేడా కనిపిస్తుంది. ఒక మనిషి సూర్యోదయానికి ఎదురుగా నిలబడితే, ఆ లేత ఎండలో శరీరం ఆనందిస్తుంది. అదే సూర్యుడు ఇదే మనిషి మధ్యాహ్నం సూర్యునికి ఎదురుగా నిలబడితే ఆ వేడిని భరించలేడు. మళ్ళీ తిరిగి అదే సూర్యుడు ఇదే మనిషి సాయంకాలం ఎండలో నిలబడితే మళ్ళి ఆనందాన్ని పొందుతాడు. సూర్యునిలో తేడా లేదు, మనిషిలో తేడా లేదు, కానీ దేనిలో తేడా వచ్చింది అంటే కాలంలో! అది మంచి చేదు కాలాన్ని నిర్ణయించి కార్యాకార్య నిర్వహణ చేసేటటువంటి అద్భుతమైనటువంటి స్థితి ఏమిటి అంటే! అదే ముహూర్తం. ఈ ముహూర్తం అనేది రెండవ భాగం. **మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో...**

# ఇదిగో !!

# సరికొత్త శీర్షిక ...

జ్యోతిష్య పరిజ్ఞానాన్ని పాఠకులకు అందించే ప్రయత్నానికి శ్రీసన్నిధానం శ్రీకారం చుట్టింది. శ్రీసన్నిధానం గౌరవ సంపాదకులు, ప్రముఖ జ్యోతిష్య, వాస్తు పండితులు, ప్రసిద్ధులు శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక గారు శ్రీసన్నిధానం పత్రిక ద్వారా అందరికీ ఆసక్తిని కలిగించి, జిజ్ఞాసను తీర్చే విధంగా జ్యోతిష్య సంబంధ విశేషాలను అందిస్తున్నారు. పాఠకుల సందేహాలు, సమాధానాలు ధారావాహికంగా అందివ్వడానికి ముందుకు వచ్చారు. జ్యోతిష్య శాస్త్ర విశేషాలను పాఠకులకు అందించే ప్రయత్నం ఇది.

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**
**మీసందేహాలను నివృత్తి చేసుకోండి!!**

మీ సందేహాలను శ్రీసన్నిధానం వెబ్‌సైట్ ద్వారా కానీ, ఫేస్ బుక్ ద్వారా కూడా పంపించవచ్చు

**సందేహ ప్రశ్నలను పంపాల్సి వాట్స్ ఆప్ నెం 9502583323**

**-మేనేజింగ్ ఎడిటర్**

# ఆధ్యాత్మిక వార్తలు



# శ్రీరామానుజ సిద్ధాంత సభ

ఆళ్వార్ దివ్య ప్రబంధం ప్రాజెక్ట్ టి టి డి తిరుపతి , శ్రీరామానుజ సిద్ధాంత సభ సికిందరాబాద్. వారిచే సంయుక్తంగా జనవరి 25 వతేదీనుండి. 29 వరకు ఇతిహాస దివ్య ప్రబంధ విద్వత్సదస్సు నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ శ్రీవైష్ణవ సంప్రదాయ పండితులు పాల్గొని వారికి నిర్దేశింప బడిన అంశాలపై ఉపన్యసించారు.

## అభివర్ధతాం

శ్రీమాన్ శ్రీ కామాండూరు ఇళైయ విల్లి స్థలశాయి




సనాతనము, పరమ వైదికము అయినది శ్రీ వైష్ణవ ధర్మం. అనాదిగా వైదిక ధర్మమునకు చెందిన శైవ, శాక్తేయ, గాణాపత్య, వైష్ణవాది పలు శాఖలు, సంప్రదాయాలు పరంపరాగతమైన ఆచరణతో మన దేశంలో వ్యాప్తిని పొందాయి. ప్రస్తుతం సమాజంలో ఏర్పడిన ప్రపంచీకరణ విధానంలో ఈ పరంపరలు అడుగంటుతున్నాయి. వీటిని కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రధానంగా ఈ సాంప్రదాయ వ్యవస్థను కాపాడటానికై మఠాధిపతులు, పీఠాధిపతులు, ఆచార్య పురుషులు అనేక విధాలుగా కృషి చేస్తున్నారు.

వారు చేస్తున్న కృషిలో భాగంగానే వారు కూడా మాసపత్రికలను, త్రైమాసిక పత్రికలను ముద్రిస్తూ ధార్మిక ప్రచారాన్ని చేస్తున్నారు. వారి వలెనే కొందరు ఆధ్యాత్మికవేత్తలు కూడా మాసపత్రికలను నడుపుతున్నారు. అట్టి కోవలోనే శ్రీ సన్నిధానం అనే మాస పత్రికను నడుపుతూ సాంప్రదాయ వ్యాప్తికి కృషి చేయడం ఆనందదాయకం. శ్రీమాన్ వొద్దిపర్తి రామచంద్ర మూర్తి, సముద్రాల శారద, శ్రీమాన్ డింగరి శ్రీనివాసమూర్తి గారల సంపాదకత్వంలో ఈ శ్రీసన్నిధానం మాసపత్రిక మరింతమంది పాఠకులతో సంస్కృతి సాంప్రదాయ వ్యాప్తికై కృషిచేయాలని భద్రాచల సీతారామచంద్ర మహాప్రభువుల వారి చరణారవిందములలో ప్రార్థిస్తున్నాను

## మనసా వచసా

శ్రీమాన్ శ్రీ కోదండ రామాచార్యులు



శ్రీ సన్నిధాన సాహితీ
పత్రిక జ్ఞాన దాయిని
భారతి దేవి కృపయా
వృద్ధిం వింధ్యాత్ ధరాతలే

శ్రీపతి తత్వ విచారము
మీ పత్రిక తెలియజెప్పి
మిత్రుల కోటిన్
సత్పాఠకులను చేసెను
మీ పుత్రిక శిష్టసతికి మేలును గూర్చున్

దీవించునయా శారదా,
జీవింతురు భక్తజనులు శ్రీసన్నిధిలో
భావింతురు సత్కృతియని
సేవింతురు శ్రీపదములె జీవన మనసున్

వ్యాసముల సూక్తి సుధలను
న్యాసము చేయుచు
సురుచిర నైపుణ్యముతో
"శ్రీ సన్నిధానం" వెలయ
మా స్వామిని వేడుకొందు మనసా వచసా.

## అక్షరామృతము - బహుజనహితము

శ్రీమాన్ శ్రీ చించాపట్ల జగన్మోహనాచార్యులు



భగవత్ భాగవత ఆచార్య మంగళా శాసనముల వలన పూర్వాచార్యులు కృపజేసిన సూక్తి సుధను, విశిష్టాద్వైత సిద్ధాంతం వైభవమును కృపామాత్ర ప్రసన్నాచార్యుల లేఖినిద్వారా వర్ణ రూపమునపొంది అట్లు పొందిన అక్షరామృతమును బహుజనహితాయ అచ్చు చేసి జిజ్ఞాసువులకు చేరవేసి భగవద్విషయము సామాన్యులకు అందజేయుటకు సంపాదకవర్గం చేయుచున్న కృషి ప్రశంసించదగియున్నందున భగవదనుగ్రహపాత్రమై మరింత వైభవమును పొందవలయునని స్వామిని ప్రార్థించుచున్నాను.

# 50వ శ్రీమద్భాగవతసప్తాహ జ్ఞానయజ్ఞము

## శ్రీమాన్ శ్రీనంబి వేణు గోపాలాచార్య కౌశిక




శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక గారిచే 50వ శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ ప్రవచన కార్యక్రమము దిగ్విజయంగా జరిగింది. ఇందులో ఆధ్యాత్మిక పురస్కారాన్ని గుండేటిరాజు, కళాసాహితీకి అందజేశారు. ఈ కార్యక్రమములో శ్రీమాన్ శ్రీ నమిలకొండ రమణాచార్యులు, జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, సీనియర్ పాత్రికేయులు టి.వి.సూర్యం, సిరిసిల్ల శ్రీనివాస్, స్థానిక పండితులు పురాణం మహేశ్వర శర్మ గారు మరియు నగరంలోని ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లోని చైతన్యపురి మహాశక్తి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ గారి దంపతుల చేతులు మీదుగా గోదా రంగనాధుల కల్యాణం నిర్వహింపబడింది. ప్రముఖ జ్యోతిష్య వాస్తు పండితులు శ్రీమాన్ శ్రీనమిలకొండ రమణాచార్యుల గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు అద్భుతంగా ప్రవచనం చేశారు.

## శ్రీ సన్నిధానం చారిటబుల్ ట్రస్ట్

### మొదటి సంవత్సరంలో జరిపిన కార్యక్రమాలు

1.వంశీ,దీపికలు (యు.కే) ద్వారా వేద పాఠశాల 40 విద్యార్థులకు పుస్తకాల వితరణ చేసి శ్రీ ఉ.వే శ్రీమాన్ వరప్రసాదాచార్యలు (వేద భవనం) వారిని సత్కరించింది.

2.మొదటి సంవత్సరం శ్రీమాన్ శ్రీ ఉ.వే కండ్లకుంట వెంకటనర్సింహాచారి గారికి సన్మానం

3.శ్రీసన్నిధానం పత్రిక పాఠకులను పెంచుతూ ఆన్ లైన్ లో కాకుండా ప్రత్యక్షంగా పత్రిక ప్రతిని ముద్రించి పాఠకులకు అందించడం.

4.శ్రీమాన్ శ్రీ ఉ.వే. అమరవాది వేంకటనర్సింహాచార్యులను సత్కరించింది

5.శ్రీవైష్ణవ ఆగమ సేవా సంస్థ (శ్వాస్), ప్రత్యేక సంచికలు మొదటి, రెండు సంవత్సరాల వార్షికోత్సవ సంచిక అక్షర కైంకర్యం సమర్పించుకోవడం.

6.ప్రత్యేక ఆహ్వానం మేరకు శ్రీసన్నిధానం సంపాదకులు సూర్యాపేటలో జరిగిన శ్వాస్ కార్యక్రమాలకు హాజరు.

7. ఆధ్యాత్మిక భావాన్ని పాఠకులకు సులువుగా అర్థమయ్యేలా పండితులు, రచయితలను ప్రోత్సహించి వారి రచనలను స్వీకరించి ప్రచురించడం.

మరియు మొదటి సంవత్సరం వార్షికోత్సవ సందర్భంగా మార్చి 2023 చివరి వారంలో పండిత సన్మానం, ఉత్తమ విద్యార్థులను అవార్డులు ఇవ్వటానికి సంకల్పించారు.